అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

- గరంగరంగా జూలపల్లి మండల సభ
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణ
- కింది స్థాయి సిబ్బందిని పంపడంపై సభ్యుల నిలదీత



మండల సభలో అధికారులను నిలదీస్తున్న సభ్యులు

జూలపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచులు,ఎంపీటీసీలు మండల సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధ్యక్షురాలు కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభా దృష్టికి తీసుకొచ్చారు. జూలపల్లి సర్పంచ్ నర్సింహయాదవ్ మాట్లాడుతూ పాఠశాలల్లో దివ్యాంగుల పిల్లలకు బోధన పట్టించుకోవడం లేదని, గ్రామంలో ఎస్సీ కాలనీలో కరెంట్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. సభకు అధికారులు రాక సిబ్బందిని పంపి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వడ్కాపూర్ బౌద్ధ స్థూపం వరకు కరెంట్ సౌకర్యం కల్పించాలని ఎన్ని సార్లు వినతులు చేసినా పట్టించుకోక పోవడం ఏమిటని వడ్కాపూర్ ఎంపీటీసీ రమేశ్ ప్రశ్నించారు. మిషన్ భగీరథ తాగునీరు లక్ష్యం మేరకు సరఫరా కావడం లేదని సర్పంచ్ మాంకాళి తిరుపతి అన్నారు. ధరణితో పాత సమస్యలు పరిష్కరం కావడం లేదని, కొత్త సమస్యలు తలెత్తి గ్రామాల్లో వివాదాలు వస్తున్నాయని తేలుకుంట ఎంపీటీసీ కత్తెర్ల శ్రీనివాస్ ఆరోపించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీ రమాదేవి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, తహసీల్దారు జయశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరావు, సర్పంచులు ఈర్ల మల్లేశం,ఎల్లయ్య తొంటి పద్మ, ఎంపీటీసీలు శ్రీలత,వెంకటేశం,మమత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: కంటి వెలుగుకు అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో కంటి వెలుగు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి సమస్యలు ఉన్నప్పటికీ ఆస్పత్రి వెళ్లే స్థోమత లేదన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని అవసరం ఉన్న వారికి అద్దాలను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్ గాజుల లక్ష్మి, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడులో 122 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎలిగేడు మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా అన్నారు. మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగులో భాగంగా మంగళవారం 122మందికి కంటి పరీక్షలు నిర్వహించి 19మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా కొనసాగుతున్న కంటి వెలుగు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాలు, కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో విడతల వారీగా కంటివెలుగు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కంటి పరీక్షలు చేసుకునేందుకు ప్రతీ ఒక్కరు ఆసక్తి చూపిస్తుండడంతో శిబిరాల వద్ద క్యూ లైన్లు ఉంటున్నాయి. కాగా ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు చేసే విధంగా సర్పంచులు, కార్పొరేటర్లు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం


మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మనాలి

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. మంగళవారం రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలో సుమారు 200 మంది మహిళలు మనాలి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 ఏళ్లుగా ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ, నిరంతరం ప్రజా క్షేమం కోరే, నిస్వార్థ నాయకుడు రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రతి కార్యకర్తకు రాజ్ ఠాకూర్ అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈసారి కచ్చితంగా రాజ్ ఠాకూర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాదం విజయానంద్, టౌన్ కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్ పాషా, కళ్యాణ్, రాజేష్, రమేశ్, సురేశ్, సాయి దేవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శంకరమ్మ, పద్మ కాజల్ చిలకమ్మ,,నర్మద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

ముత్తారం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అదే విధంగా ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించడంతో పాటు నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎవరైన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెంచిన చార్జీలను తగ్గించాలి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి: ప్రభుత్వం అక్రమంగా పెంచిన ఏసీడీ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీసీసీ సభ్యుడు, ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేసిన అనంతరం సబ్ ఇంజినీర్ కు వినతిపత్రం అందజేశారు. ఏసీడీ పేరుతో కరెంటు బిల్లులు అధికంగా వేసి, పేదలను వేధించడం దారుణమన్నారు. పెంచిన చార్జీలను తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మానుమండ్ల శ్రీనివాస్,కందుకూరి అంజయ్య,కొరెపు సంపత్, ఫకీర్, రవి, లంగస్వామి, రమేశ్, ప్రణయ్,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తేనే లక్ష్యం చేరుతాం


డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: సంఘాలకతీతంగా విద్యుత్ ఉత్పత్తి లక్ష్య సాధనకు పాటుపడాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటామని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. మంగళవారం ఎస్ఈ చాంబర్‌లో బీసీ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ లైజన్ ఆఫీసర్ కోలహాలం శ్రీనివాస్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు లగిశెట్టి రవికుమార్, బొడ్డు యాదగిరి, కొమ్మురాజుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం పెరుగుతుంది


కీడాకారులకు సూచనలిస్తున్న నారాయణ

యైటింక్లయిన్‌కాలనీ: క్రీడలతో విద్యార్థులలో శారీరక ధారుఢ్యంతో పాటు ఐకమత్యం పెరుగుతుందని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నారాయణ రావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడా కారులకు పలు సూచనలు చేశారు. పాఠశాల హెచ్ శోభన్ రావు మాట్లాడుతూ కబడ్డీ, ఖో–ఖో, రన్నింగ్, చెస్, క్యారమ్స్, ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 26న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ గుడికి భూమిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: అల్లూరు గ్రామ శివారులో రేణుకాఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి నేడు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ భూమిపూజ చేయనున్నట్లు అల్లూరు గౌడ్ సంఘం అధ్యక్షులు ఆకుల నారాయణ తెలిపారు.గౌడ కులస్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సంఘం నాయకులు కోరారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

జూలపల్లి: కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టి పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.మంగళవారం జూలపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. పేదల సంక్షేమ ధ్యేయంగా దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, ఎంపీడీవో వేణుగోపాలరావు, తహసీల్దార్ జయశ్రీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంజెర్ల వెంకటయ్య, వైస్ చైర్మన్ మొగురం రమేశ్, సర్పంచ్ నర్సింహయాదవ్, ఎంపీటీసీ శ్రీనివాస్, శ్రీలత, దండె వెంకటేశం, సర్పంచులు,ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ అనిత

ముత్తారం:విద్యార్థినులు తాము ఎంచుకున్న రంగంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్టు అనిత అన్నారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులుసమాజంలో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే దేశానికి గర్వకారణం

ఎలిగేడు: ఆడపిల్లలే దేశానికి గర్వకారణమని సర్పంచ్ భూర్ల సింధూజ అన్నారు. మంగళవారం ఎలిగేడు జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికలదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హక్కులు, బాధ్యతలు, బాలికలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు.కార్యక్రమంలోమెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, హెచ్ఎం జీవన్‌రెడ్డి, ప్రేమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

రామగుండం: బాలిక దినోత్సవం పురస్కరించుకొని కుందనపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో బాలికల పాత్ర, అనుసరించాల్సిన విధానాలు, ఆత్మ రక్షణ, బాల్య వివాహాలతో ఇక్కట్లు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కేజీబీవీ పాలకుర్తి బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్పెషల్ ఆఫీసర్ స్వరూప ఉపాధ్యాయులతో కలసి బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

పెద్దపల్లిరూరల్: బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మైత్రేయి అన్నారు.మంగళవారం కళాశాలలో బాలికాదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి నరహరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు


పెద్దబొంకూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దపల్లిరూరల్/ధర్మారం/ఎలిగేడు/జూలపల్లి/పాలకుర్తి/ఫెర్టిలైజర్‌సిటీ: మార్కండేయ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా పద్మశాలీ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ శివాలయంలో పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో మంగళవారం మార్కండేయజయంతి వేడుకలను నిర్వహించారు. ధర్మారం మార్కేండేయ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎలిగేడు మండలకేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. జూలపల్లి మండల కేంద్రంలోని పద్మశాలి కమ్యూనిటీ భవనం వద్ద మంగళవారం మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బసంత్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయ ప్రాంగణంలో గల శ్రీభక్త మార్కండేయ ఆలయంలో జయంతి వేడుకలను మంగళవారం పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకంతో పాటు హోమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రామగిరి మండలంలోని బేగంపేట మార్కండేయ స్వామి ఆలయంలో మంగళవారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఫెర్టిలైజర్‌సిటీలోని గౌతమినగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం పద్మశాలి పద్మబ్రహ్మ సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ అష్టోత్తర శతనామావళి, మార్కండేయ హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పద్మశాలీ కులస్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తాగునీరందించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు మిషన్ భగీరథ నుంచి తాగునీరందించాలని సీపీఎం నాయకులు వై.యాకయ్య, వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం తిలక్‌నగర్, రమేశ్‌నగర్, ఎల్‌బీనగర్, జవహర్‌నగర్, పరుశరాంనగర్, భగత్‌సింగ్‌నగర్, రాంమందిర్ ఏరియా, సీతానగర్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్మిక కుటుంబాలకు సరైన తాగునీరందించకుండా సింగరేణి యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. డ్రెయినేజీ రోడ్ల వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, లావణ్య, భిక్షపతి, రాజేశ్వరి, శ్రీనివాస్, అరవింద్, ఉపేందర్, నర్సన్న, మహ్మద్ పాల్గొన్నారు.

బామ్లానాయక్‌తండాలో ఉచిత వైద్యశిబిరం

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో మంగళవారం ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రవిశంకర్, రమ హాజరై గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 120 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బదావత్ రాజునాయక్ మాట్లాడుతూ ఎన్టీపీసీ ప్రభావిత గ్రామం బామ్లానాయక్‌తండా అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్యామ్యుల్, సమ్మక్క, సన్నీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై సర్వే

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం పెద్దంపేట్‌లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. గతంలో పెద్దంపేట, మంగళపల్లి గ్రామాల్లోని భూములు కోల్పోయిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాకపోడంతో హైకోర్టును ఆశ్రయించారు. మళ్లీ సర్వే చేపట్టి అర్హులైన వారందరికీ ప్యాకేజీ వర్తింప చేయాలని కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ ఆర్ఐ సతీశ్, అధికారులు, భూ నిర్వాసితులతో మాట్లాడి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్, భూ నిర్వాసితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బల్దియాలో టౌన్ ప్లానింగ్ ఏడీ పర్యటన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ భిక్షపతి మంగళవారం పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న పలు ఫిర్యాదులను నేరుగా పరిశీలించడానికి బల్దియాకు వచ్చారు. ముందుగా నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావుతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం టీపీఎస్ సతీశ్‌తో కలిసి అడ్డగుంటపల్లి చెరువు కట్ట ప్రాంతాన్ని అడిషనల్ డైరెక్టర్ పరిశీలించారు. మార్కండేయకాలనీలోని ప్రధాన నాలాను కూడా పరిశీలించి, నాలా కబ్జాపై వచ్చిన ఫిర్యాదు మేరకు వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గణతంత్ర ఏర్పాట్లు పరిశీలన

రామగిరి: సెంటనరీకాలనీలోని రాణి రుద్రమాదేవి క్రీడా మైదానంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను మంగళవారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు కార్మికులు, అధికారలు, యూనియన్ సంఘాల నాయకలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జీఎం వెంట అధికారులు రఘుపతి, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, కర్ణ, పద్మరాజు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌కు గురుకుల విద్యార్థి

మంథని: జాతీయ స్థాయి అండర్ – 14 టెన్నీకాయిట్ పోటీలకు మంథని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి రాహుల్ ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో జరిగే 35 జాతీయస్థాయి పోటీల్లో రాహుల్ పాల్గొంటారని పిజికల్ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు.

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న చంద్రశేఖర్ దంపతులను ఘనంగా సన్మానించారు. స్థానిక ఇల్లెందు క్లబ్‌లో శాలువాలతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. నాలుగు దశాబ్దాల సింగరేణి ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్జీ–1,2,3, ఏపీఏ, రెస్క్యూ, సేఫ్టీ జీఎంలు నారాయణ, ఎ.మనోహర్, టీవీరావు, కె.శ్రీనివాసు, వెంకటేశ్వర్లు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు సూపరింటెండెంట్‌ను నియమించాలి

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి కొత్త మెడికల్ సూపరింటెండెంట్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి, డీఎంఈ, జిల్లా కలెక్టర్లకు సీపీఐ నాయకులు లేఖలు రాశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, సహాయ కార్యదర్శి మద్దెల దినేష్ మాట్లాడారు. ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందిని ఉన్నతాధికారులు మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ భర్త ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నప్పటికీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాలే సూపరింటెండెంట్‌గా బాధ్యతలను నిర్వహిస్తుండడం సరికాదన్నారు. ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఓ డ్రైవర్ ఆస్పత్రిలో అనేక అక్రమ దందాలకు పాల్పడుతూ, సిబ్బందిపై పెత్తనం చలాయిస్తున్నాడని ఆరోపించారు. ఆస్పత్రి, మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రూ.లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆత్మ రక్షణకు కరాటే ఉపయోగపడుతుందని కేజీబీవీ పాలకుర్తి ఎస్‌వో స్వరూప అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థినులకు కరాటే మాస్టర్ రామస్వామితో కలసి కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : బాలికల ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెచ్ఎం విజయ్ రావు అన్నారు. మంగళవారం బాలికల హైస్కూల్లో కరాటే తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాస్టర్ కనకేష్ సిబ్బంది ఉన్నారు.

అంత్యక్రియలకు మిషన్ స్మైల్ ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన రేవెల్లి మొండయ్య సోమవారం ఆత్మహత్య చేసుకోగా, మొండయ్య అంత్యక్రియల కోసం మిషన్‌స్మైల్ సభ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మిషన్‌స్మైల్ సభ్యులు ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు సతీష్, అజయ్ గౌడ్, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందలేదు'

మంథని: మండలంలోని పోచమ్మవాడలో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అనర్హులకు పంపిణీ చేసారని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. సామాన్యులు, అర్హులకు ఇళ్లను అందించలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే అందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎడ్ల సదాశివ్, సబ్బాని సంతోష్, బోయిని నారాయణ, బోగోజు శ్రీనివాస్, నాంపల్లి రమేష్, మల్లికార్జున్ ఉన్నారు.

జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా విజయ్

ముత్తారం: గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కోల విజయ్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి మాచిడి రవితేజ గౌడ్ తెలిపారు. అనంతరం నియామకపు పత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలి

రామగుండం: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు కుక్క గంగాప్రసాద్ కోరారు. రాజ్యాంగంలో వివిధ రకాల ఆర్టికల్స్ పొందుపరిచారని, అలాంటి మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను గణతంత్ర దినోత్సవం రోజున స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పంచాయతీ సర్వసభ్య సమావేశం

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామపంచాయతీ సమావేశం ఉపసర్పంచు ముత్యాల చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ సర్పంచ్ సత్తయ్యను సస్పెండ్ చేసి, ఉపసర్పంచు ముత్యాల చంద్రశేఖర్ చెక్ పవర్ రద్దు చేశారు. ఉపసర్పంచ్ హైకోర్టుకు వెళ్లి చెక్ పవర్ పునరుద్ధరించుకున్నారు. రెండో చెక్ పవర్ కోసం వార్డు సభ్యుడు ముదాం శ్రావణ్‌కుమార్‌ను ఎంపికకు తీర్మానం చేసినట్లు ఎంపీవో రమేశ్ తెలిపారు.సమావేశంలో ఎంపీటీసీ సదయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల తనిఖీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న ధూళితో శాంతినగర్, గౌతమినగర్, ప్రగతినగర్, లూర్దునగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఆయా సొసైటీల అధ్యక్షులు నల్లాల ప్రణీత్, గోపాల్‌రావు కాలుష్య నియంత్రణ మండలిలో ఫిర్యాదు చేశారు. మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ భిక్షపతి గౌతమినగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రైస్ మిల్లలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని రైస్‌మిల్ యజమానులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలని కేటీఆర్‌కు లేఖ

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 24వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత వినతిపత్రం పంపించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని మహిళా భవనం పూర్తయి మూడేళ్లయినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోవడం లేదని తెలిపారు. నాలుగు వరసల రహదారి పనులకు టెండర్ అయి ఆరు నెలలు కావస్తున్నా పనులు మొదలు కాలేదని, వీధి వ్యాపారుల షెడ్లు నిర్మించినప్పటికి మంజూరు చేయలేదని, ఇంకాపెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం కోరినట్లు పేర్కొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

గోదావరిఖని: గోదావరినది ఇన్‌ఫిల్టరేషన్ గాలరీలకు మరమ్మతులు చేస్తుండడంతో 15 రోజుల పాటు కార్మిక కుటుంబాలకు గోదావరి నది నుంచి వచ్చే నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్మిక కుటుంబాలు పొదుపుగా నీటిని వాడుకుని సంస్థకు సహకరించాలని కోరారు.